దైవ దర్శనానికి వెళ్లి.. గోదావరిలో తల్లీకొడుకు గల్లంతు

- ఏపీలోని వేలేరుపాడు వద్ద గోదావరిలో ఘటన
- గజ ఈతగాళ్ల తో మృతదేహాలను వెలికితీయించిన అధికారులు
- మృతులు ఖమ్మంజిల్లా అశ్వారావుపేట వాసులు

మృతదేహాలను గోదావరి నుంచి బయటకు తీసుకొస్తున్న గజ ఈతగాళ్లు

అల్లంశెట్టి నాగమణి, అల్లంశెట్టి తేజ శ్రీనివాస్ (ఫైల్)

అశ్వారావుపేట, జూన్ 10 : భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట పట్టణానికి చెందిన తల్లీకొడుకు గోదావరిలో గల్లంతైన ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం కట్కూరు గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. పూర్తి వివరాల్లోకెళ్తే.. అశ్వారావుపేట పట్టణంలోని చిన్నంశెట్టి బజార్‌కు చెందిన అల్లంశెట్టి నాగేశ్వరరావు, వంటశాల వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులతో సహా 11మంది రెండు ఆటోల్లో కట్కూరు శివాలయానికి వెళ్లారు. అక్కడ దైవదర్శనం చేసుకుని స్నానాల కోసం గోదావరిలోకి దిగారు. అల్లంశెట్టి తేజ శ్రీనివాస్(23) స్నానంచేస్తూ కాలు జారి నదిలో కొట్టుకుపోతున్నాడు. గమనించిన అతడి తల్లి అల్లంశెట్టి నాగమణి(45) కొడుకును కాపాడబోయి ఆమె కూడా గల్లంతైంది. దీంతో కుటుంబసభ్యులు కేకలు వేస్తూ ఏమీ చేయలేక ఉండిపోయారు. స్థానికుల సమాచారంతో ఎస్సై చెన్నారావు, ఎంపీడీవో శ్రీహరి, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్ ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గజఈతగాళ్లను పిలిపించి మృతదేహాలను వెలికితీయించి ఒడ్డుకు చేర్చారు.

పేగుబంధాన్ని కాపాడబోయి..

నవమాసాలు మోసిన ఆ తల్లి తన కొడుకు కళ్లేదుట గోదావరిలో కొట్టుకుపోతుంటే చూసి చలించిపోయింది. పేగుబంధాన్ని కాపాడబోయి తనూ ప్రాణాలు విడిచింది. ఈ ఘటన చూసిన వారంతా కన్నీటి పర్యంతమయ్యారు. భార్య, కుమారుడు కళ్లేదుటే గోదావరిలో కొట్టుకుపోవడానికి చూసి నాగేశ్వరరావు గుండెలవిసేలా రోదించాడు.

'పేట'లో విషాదం

నాగమణి, తేజ శ్రీనివాస్ మృతితో అశ్వారావుపేటలో విషాదం నెలకొంది. అల్లంశెట్టి నాగేశ్వరరావు కుటుంబం ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో బత్తాయి జ్యూస్ అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నది. తేజ శ్రీనివాస్ కిరాణా దుకాణంలో గుమస్తాగా పని చేస్తున్నాడు. తల్లీ కొడుకుల మృతదేహాలను చూసి కుటుంబసభ్యులు, స్థానికులు బోరున విలపించారు.

ఓట్ల కోసం పాట్లు పడ్డారు

- అబద్ధాలు, అసత్యాలతో 'కాంగ్రెసోళ్లు' ప్రయోజనం పొందారు
- కేసీఆర్ చేసిన అభివృద్ధిని వారు చేసిన అభివృద్ధిగా చెప్పుకున్నారు
- ఎన్నికల్లో ఓట్ల కోసం ఎన్నెన్నో తప్పుడు ప్రచారాలు చేశారు
- గోదావరి, మూర్రేడు రెండో వంతెనలను వారి ఖాతాల్లో వేసుకున్నారు
- నవమి పేరుతో భద్రాద్రి రెండో బ్రిడ్జిని అనధికారికంగా ప్రారంభించారు
- ఎమ్మెల్సీ ఓట్ల కోసం కొత్తగూడెం బ్రిడ్జిపైనా రాకపోకలకు అనుమతిచ్చారు
- అంతిమంగా గట్టెక్కారు.. కానీ ప్రజలు మాత్రం అన్నింటినీ గమనించారు

పాల్వంచ మండలం యానంబైలు గ్రామంలో రెండేళ్లయినా పూర్తికాని ఓవర్ బ్రిడ్జి

కొత్తగూడెంలో మూర్రేడు రెండవ వంతెనను ప్రారంభం కాకుండానే రాకపోకలు క్లియరెన్స్ ఇచ్చిన అధికారులు

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 10 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికలప్పుడు అలవిగాని హామీలు గుప్పించారు. ఎలాగోలా అధికారాన్ని చేజిక్కించుకున్నారు. ఆరు నెలలు గడిచేసరికి వెల్లకిలా పడ్డారు. హామీల విషయాన్ని ప్రజలు ప్రశ్నిస్తుంటే అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్నారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల తీరొక్క మాటలు చెప్పారు. ప్రజల దృష్టిని మళ్లించారు. తాము చేయని పనులను కూడా తామే చేశామంటూ గప్పాలు చెప్పుకున్నారు. నిన్నటి పట్టభద్రుల ఎన్నికల్లో ఓట్ల కోసం పాట్లు పడ్డారు. గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను సైతం తామే చేశామంటూ ప్రచారం చేసుకున్నారు. చివరికి ఎన్నికల కోడ్‌ను కూడా పక్కనబెట్టి అభివృద్ధి పనులను అనధికారికంగా ప్రారంభించారు. ఇందులో భదాచలం వద్ద గోదావరిపై రెండో వారథి, కొత్తగూడెంలో మూర్రేడుపై రెండో వంతెన ప్రధానంగా ఉన్నాయి. వరదలొచ్చే వేళ మారుమూల ప్రాంతాల్లోని బ్రిడ్జిల నిర్మాణంపై మాట్లాడని వారు.. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను మాత్రం ముందుముందుగానే ప్రారంభించుకున్నారు. పట్టభద్రులైన ఓటర్లు పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉంటారు కాబట్టి వారితో ఓట్లు వేయించుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. ఎట్టకేలకు ప్రయోజనం పొందారు. వారే.. అబద్ధాలు, అసత్యాల కాంగ్రెస్ పాలకులు. ఓట్ల కోసం వారు పడిన పాకులాటలను, గత ప్రభుత్వం చేసిన పనులన్నీ తాము చేసినవేనని చెప్పుకున్న ప్రచారాలను జిల్లా ప్రజలందరూ గమనించారు. వారి తీరును చూసి ముక్కున వేలేసుకున్నారు.

భద్రాద్రి బ్రిడ్జిపై గప్పాలు..

భద్రాచలం వద్ద గోదావరిపై బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన వారథిని శ్రీరామనవమి పేరుతో ఏప్రిల్ 15న కాంగ్రెస్ పాలకులు అనధికారికంగా ప్రారంభించారు. దాని నిర్మాణం తమ దేనంటూ గప్పాలు చెప్పుకున్నారు. కొత్తగూడెం మూర్రేడు బ్రిడ్జి విషయంలోనూ ఇదే తీరును అవలంబించారు. ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం మూర్రేడుపై రెండో వారథిపై రాకపోకలను అనుమతించారు. నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో కాకపోయినా రాకపోకలకు లైన్ క్లియర్ చేయడం వెనుక అర్థం ఎన్నికల జిమ్మిక్కేనన్న విషయాన్ని ఇక్కడి ప్రజలందరూ గమనించారు.

అభివృద్ధి ఘనత బీఆర్ఎస్‌ది.. ప్రచారం చరిత్ర కాంగ్రెస్‌ది..

అలవిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు.. వాటి అమలును పక్కనబెట్టింది. గత కేసీఆర్ ప్రభుత్వంలో చేపట్టిన పనులపైనే దృష్టి సారించింది. దీంతో ఇటీవలి ఎన్నికల్లో ఓట్లు దండుకోవడం కోసం రూ.కోట్ల వ్యయంతో నిర్మాణాలు పూర్తి చేసుకున్న వంతెనలను ప్రారంభించుకొని పబ్బం గడుపుకుంది. భద్రాచలం రెండో వంతెన నిర్మాణానికి గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రూ.65 కోట్లతో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే దానిని వేగవంతం చేసుకుని తమ ఖాతాలోనే వేసుకున్నారు. అలాగే కొత్తగూడెం మూర్రేడుపై రెండో వంతెనది కూడా తమ ఘనతేనని చెప్పుకుంటున్నారు. మారుమూల ప్రాంతాల్లో వర్షాలు వస్తే రాకపోకలు నిలిచిపోయే వంతెనలవైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. పాల్వంచ మండలం యానంబైలు వంతెనపై ఉమ్మడి జిల్లాల్లోని ముగ్గురు మంత్రుల్లో ఏ ఒక్కరూ దృష్టిపెట్టలేదు. గత కేసీఆర్ సర్కారు రూ.10 కోట్లు మంజూరు చేసి యానంబైలు వంతెన పనులు ప్రారంభించింది. కానీ.. ఇప్పటి సర్కారు దాని గురించి పట్టించుకోనేలేదు. సుజాతనగర్ మండలం వేపలగడ్డ వద్ద కూడా రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయి చివరి దశకు వచ్చింది. కానీ.. దానిని కూడా సర్కారు చిన్నచూపు చూస్తోంది. కేవలం ఓట్లు దండుకునే వాటిపై మాత్రమే దృష్టిపెట్టింది. వాటిని ప్రారంభించుకుంది.

ప్రజలు గమనిస్తున్నారంటున్న బీఆర్ఎస్..

అబద్ధాలు చెప్పుకుంటూ పబ్బం గడుపుతున్న కాంగ్రెస్ సర్కారును ప్రజలు గమనిస్తూనే ఉన్నారని బీఆర్ఎస్ ఎద్దేవా చేస్తోంది. అయినా దీనిపై కాంగ్రెస్ సర్కారు నోరుమెదపడం లేదు. చేసిన అభివృద్ధిని చెడగొట్టడానికి కొత్త జిల్లాలను తీసేస్తామంటూ ప్రకటనలు చేయడంపై జనం మండిపడుతున్నారు.

ఓట్ల కోసమే కాంగ్రెస్ వెంపర్లాట..

దేశంలో ఎక్కడా లేని అభివృద్ధిని గత సీఎం కేసీఆర్ పదేళ్లలోనే తెలంగాణలో చేసి చూపించారు. 33 జిల్లాలకు మెడికల్ కాలేజీలు ఇచ్చారు. కొత్త కలెక్టరేట్లు నిర్మించారు. పరిపాలనను ప్రజలకు దగ్గర చేశారు. ఇప్పుడున్న చేతకాని ప్రభుత్వం మా పాలనలో కట్టిన బ్రిడ్జిలను ప్రారంభించుకుని ఓట్ల కోసం వెంపర్లాడింది. అయినా ఆరు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం చతికిలపడింది.

-రేగా కాంతారావు, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు

జంట పట్టణాలుగా అభివృద్ధి చేశాం..

గత కేసీఆర్ సర్కారు కొత్తగూడెం-పాల్వంచ పట్టణాలను జంట పట్టణాలుగా అభివృద్ధి చేసింది. మూర్రేడువాగు, గోధుమ వాగులపై బ్రిడ్జిలను నా పాలనలోనే పూర్తి చేశాను. కానీ.. కాంగ్రెస్ పాలకులు మాత్రం అవన్నీ వారి గొప్పగా చెప్పుకుంటున్నారు. వారే వాటిని నిర్మించినట్లుగా ప్రచారం చేసుకుంటూ ప్రారంభోత్సవాలు చేసుకుంటున్నారు. కానీ.. అభివృద్ధి అంతా గత కేసీఆర్ సర్కారు పాలనలోనే జరిగినట్లు ఇక్కడి ప్రజలకు తెలుసు.

-వనమా వెంకటేశ్వరరావు, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే

స్వాతంత్ర్యం వచ్చిన 65 ఏళ్లలో గత ప్రభుత్వాలు ఏ జిల్లాలోనూ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసిన పాపాన పోలేదు. కానీ.. కేసీఆర్ సర్కారు మాత్రం పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాలు ఏర్పాటు చేశారు. వాటిల్లోకి ఐడీఓసీలు, మెడికల్, నర్సింగ్ కాలేజీలు తీసుకొచ్చారు. మరి కొత్త జిల్లా అయిన కొత్తగూడెన్ని కూడా తీసేస్తే కలెక్టరేట్‌ను, వైద్య కళాశాలలను ఏం చేస్తారో చెప్పాలని బీఆర్ఎస్ ప్రశ్నించినా.. ప్రభుత్వం నుంచి సమాధానం లేదు.

భద్రతా దళాలే లక్ష్యంగా బూబీట్రాప్స్

- చర్ల మండలంలో మావోయిస్టుల దుశ్చర్య

బూబీట్రాప్స్‌ని వెలికితీసిన భద్రతా దళాలు

కొత్తగూడెం క్రైం/ చర్ల, జూన్ 10 : భద్రతా దళాలే లక్ష్యంగా మావోయిస్టులు చర్ల మండలంలో ఏర్పాటు చేసిన బూబీ ట్రాప్స్‌ను పోలీసులు వెలికితీశారు. జిల్లా పోలీస్ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపిన వివరాలు... తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న భద్రాద్రి జిల్లా చర్ల మండలం పూసుగుప్ప అటవీ ప్రాంతంలో కొత్తగూడెం స్పెషల్ పార్టీ, చత్తీస్‌గఢ్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాల సంయుక్త ఆధ్వర్యంలో ఏరియా డామినేషన్ నిర్వహించారు. ఈ క్రమంలో మావోయిస్టులు భద్రతా దళాలే లక్ష్యంగా 70చోట్ల బూబీ ట్రాప్స్‌ను ఏర్పాటు చేసినట్లు జవాన్లు గుర్తించారు. వాటి నుంచి 4,396 పదునైన ఇనుప కడ్డీలను తొలగించి స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టు పార్టీ నాయకులు ఆదివాసీలకు మంచి చేస్తున్నట్లు నటిస్తూ వారి ప్రాణాలకు ముప్పువాటిల్లేలా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని అధికారులు తెలిపారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో నివసించే అమాయకపు ఆదివాసీ ప్రజలు మావోయిస్టు పార్టీ దుశ్చర్యల వల్ల బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఆదివాసీలు, జంతువులు సంచరించే ప్రాంతాలలో మావోయిస్టులు అమర్చిన ఐఈడీ, బూబీట్రాప్స్ వల్ల ఇప్పటికే చాలామంది ప్రాణాలను కోల్పోవడం, తీవ్రంగా గాయపడడం జరుగుతుందని పేర్కొన్నారు. సరిహద్దు ప్రాంతాల్లోని ఆదివాసీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటీవల ములుగు జిల్లా వెంకటాపురం ఏరియాలో మావోయిస్టుల మందుపాతర పేలి దళితుడు మృతి చెందడాన్ని ఉదహరించారు.

మహిళలపై బీజేపీ నేత లైంగిక వేధింపులు!

మొదటిపేజీ తరువాయి...

ఆరోపణలకు క్షమాపణ చెప్పడంతోపాటు అన్ని సామాజిక మాధ్యమాల నుంచి మూడు రోజుల్లో ఆ వ్యాఖ్యలను తొలగించాలని లేదా చట్టపరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ ఒక నోటీసు పంపింది. ముందుగా మాలవీయకు కలిగిన మానసిక క్షోభకు, గౌరవ భంగానికిగాను నష్టపరిహారం కింద రూ.10 కోట్లు డిమాండ్ చేసింది. బీజేపీ నేత రాహుల్ సిన్హాకు బంధువు అయిన శంతను సిన్హా ఇటీవల ఫేస్‌బుక్‌లో మాలవీయకు వ్యతిరేకంగా ఒక పోస్ట్ పెట్టారు. మాలవీయ పలువురు మహిళలపై లైంగిక దాడులకు పాల్పడ్డాడని, అనేక నీచమైన చర్యలలో భాగస్వామి అని ఆరోపించారు. ఈ ఆరోపణలపై కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ.. తక్షణం మాలవీయ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. మాలవీయ చేతిలో లైంగిక దోపిడీకి గురైన మహిళలకు బీజేపీ న్యాయం చేయాలని కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనేత్ డిమాండ్ చేశారు. ప్రధానిగా మోదీ ప్రమాణం చేసిన 24 గంటల్లోనే ఓ ప్రముఖ బీజేపీ నేతపై తీవ్రమైన ఆరోపణలు వచ్చాయని పేర్కొన్నారు. మాలవీయ చర్యలపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని అన్నారు.

వ్యాఖ్యలు ఉపసంహరించుకోను: సిన్హా

ఫేస్‌బుక్‌లో తాను చేసిన వ్యాఖ్యలు ఎవరినీ ఉద్దేశించినవి కావని శంతనుసిన్హా స్పష్టం చేశారు. కొందు బీజేపీ నేతలు తమ అధికార పదవులను కాపాడుకోవడం కోసం తమ ఢిల్లీ బాస్‌లను ప్రసన్నం చేసుకోవడానికి అనేక అక్రమ మార్గాలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. ఫేస్‌బుక్‌లో తన పోస్ట్‌ను తప్పుగా అర్థం చేసుకున్నారని అన్నారు. తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని, సామాజిక మాధ్యమం నుంచి వాటిని తొలగించలేదని, ఒత్తిళ్లకు లొంగే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తనకు అందిన లీగల్ నోటీసుకు సమాధానం ఇచ్చేందుకు కొంత సమయం కావాలని కోరానని తెలిపారు.

నీట్ అక్రమాలపై విద్యార్థుల గర్జన

కేంద్ర విద్యా శాఖ ఆఫీస్ వద్ద విద్యార్థి సంఘాల ఆందోళన

- నీట్-2024ను రద్దు చేయాలని సుప్రీంకోర్టులో పిటిషన్
- నీట్ పరీక్షను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి
- తమిళనాడు ప్రభుత్వానికి హైకోర్టు రిటైర్డ్ జడ్జి కమిటీ సిఫార్సు

నీట్ అక్రమాలపై హైదరాబాద్‌లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా

న్యూఢిల్లీ/చెన్నై, జూన్ 10: దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ యూజీ-2024 ప్రవేశ పరీక్షలో అక్రమాలపై దర్యాప్తు జరుపాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు సోమవారం ఢిల్లీలోని కేంద్ర విద్యా శాఖ కార్యాలయం సమీపంలో ఆందోళన చేపట్టాయి. పరీక్ష నిర్వహణలో అక్రమాలు జరిగినట్టు వస్తున్న ఆరోపణలపై స్వతంత్ర, పారదర్శక విచారణ చేయాలని జేఎన్‌యూ విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు అవిజిత్ ఘోష్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రవేశ పరీక్ష సమగ్రతను కాపాడేందుకు మరింత విశ్వసనీయమైన, సురక్షితమైన పరీక్షా విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని, నీట్ అంశంపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల విడులైన నీట్-యూపీ పరీక్షా ఫలితాల్లో ఏకంగా 67 మందికి మొదటి ర్యాంకు రావడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. అయితే పరీక్ష నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరుగలేదని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) చెబుతున్నది.

కౌన్సెలింగ్‌పై స్టే విధించాలి

నీట్ యూజీ-2024 ప్రవేశపరీక్షను రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అదేవిధంగా మే 5న నిర్వహించిన ఈ పరీక్షలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరిపేందుకు సిట్ ఏర్పాటు చేయాలని, పేపర్ లీక్ ఆరోపణలపై దర్యాప్తు పూర్తయ్యే వరకు కౌన్సెలింగ్‌పై స్టే విధించాలని పిటిషన్‌దారులు అభ్యర్థించారు. పరీక్ష నిర్వహణ హేతుబద్ధంగా లేదని, విద్యార్థులకు బ్యాక్‌డోర్ ద్వారా ప్రవేశాలు కల్పించేలా అక్రమాలు జరిగాయని ఆరోపించారు.

ప్లస్ 2 మార్కులే ప్రామాణికంగా ఉండాలి

నీట్ ప్రవేశపరీక్షను తొలగించేందుకు చట్ట, శాసనపరమైన చర్యలు తీసుకోవాలని మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏకే రాజన్ నేతృత్వంలోని కమిటీ తమిళనాడు ప్రభుత్వానికి సిఫారసు చేసింది. వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు హయ్యర్ సెకండరీ ఎగ్జామినేషన్(ప్లస్ 2) తరగతిలో వచ్చిన మార్కులను ప్రామాణికంగా తీసుకోవాలని సూచించింది. వివిధ పరీక్ష బోర్డుల విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నది. తమిళనాడు విద్యార్థులపై నీట్ ప్రభావంపై అధ్యయనానికి ఈ కమిటీని డీఎంకే ప్రభుత్వం 2021లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటు చేసింది.

నకిలీ ప్రకటనలను నమ్మొద్దు

సిలబస్‌పై సీబీఎస్ఈ హెచ్చరిక

న్యూఢిల్లీ: సీబీఎస్ఈ సిలబస్, నమూనా ప్రశ్నాపత్రాలు తదితర అంశాల్లో తప్పు దోవ పట్టించే ప్రకటనల పట్ల జాగ్రత్తగా ఉండాలని సీబీఎస్ఈ సోమవారం విద్యార్థులను హెచ్చరించింది. వార్తలను సరి చూసుకోకుండా ప్రచురించే ఆన్‌లైన్ పోర్టళ్లను నమ్మొద్దని సూచించింది. 'మా సిలబస్, నమూనా ప్రశ్నాపత్రాల గురించి కొన్ని పోర్టళ్లు, వెబ్‌సైట్లు కాలం చెల్లిన లింకులను, ధ్రువీకరించుకోని వార్తలను ప్రచురిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. 2024-25 విద్యా సంవత్సరానికి గాను తాజా సమాచారం అందిస్తున్నట్టు అవి తప్పుడు ప్రకటనలు ఇస్తున్నాయి' అని సీబీఎస్ఈ పేర్కొంది. వాటిని నమ్మి గందరగోళానికి గురి కావొద్దని సూచించింది.

మహా రైతుల కన్నెర్ర

- కరువు రాయితీల కోసం నేషనల్ హైవే దిగ్బంధం
- ప్రభుత్వ జాప్యంపై అన్నదాతల ఆగ్రహం

లాతూర్, జూన్ 10: కరువు రాయితీలు, ఇతర ఉపశమన ఆర్థిక ప్రయోజనాలు అందించడంలో జాప్యాన్ని నిరసిస్తూ వందలాది మహారాష్ట్ర రైతులు సోమవారం లాతూర్-అంబేజోగయి హైవేను దిగ్బంధించారు. రెనాపూర్ తహశీల్‌ను ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించినప్పటికీ రైతులకు ఇంకా కరువు రాయితీలు అందలేదని ధర్నాకు నాయకత్వం వహించిన షేత్కరీ సంఘటన నాయకుడు గజన్ బొలంగే తెలిపారు. రహదారి దిగ్బంధం రెండు గంటల పాటు సాగింది. ఈ సందర్భంగా వారు తహశీల్ కార్యాలయ గేటును మూసివేసి నిరసన తెలిపారు. '70 శాతానికి పైగా అర్హులైన రైతులకు కరువు రాయితీలు లేదా ఇతర ఉపశమన ప్రయోజనాలు అందలేదు. దీనిపై తహసీల్దార్ వివరణ ఇవ్వాలి. ఇంకా రైతుల ఖాతాల్లోకి డబ్బులు ఎందుకు వేయలేదో అధికారులు బ్యాంకులను అడగాలి' అని గజన్ అన్నారు. ఒక హెక్టార్‌కు రూ.50 వేల పంట బీమా రాయితీని కూడా రైతులు కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. ఈ నెల 20లోగా కరువు రాయితీలు అందించకుంటే రెనాపూర్ ప్రాంతంలో మరింత పెద్ద ధర్నా నిర్వహిస్తామని రైతు నాయకుడు దత్తాజీ షిండ్గే హెచ్చరించారు.

మణిపూర్ సీఎం సెక్యూరిటీ కాన్వాయ్‌పై దాడి

భద్రతా సిబ్బందిలో ఒకరికి గాయాలు

ఉగ్ర దాడిలో గాయపడిన భద్రతా సిబ్బందిని పరామర్శిస్తున్న బీరేన్ సింగ్

ఇంఫాల్ : మణిపూర్ సీఎం బీరేన్ సింగ్ సెక్యూరిటీ కాన్వాయ్‌పై మిలిటెంట్లు కాల్పులకు తెగబడ్డారు. కాంగ్‌పోక్పి జిల్లాలో సోమవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. మిలిటెంట్ల దాడిలో కాన్వాయ్‌లోని ఓ వాహనం డ్రైవర్ కుడి భుజానికి బుల్లెట్ గాయమైంది. ఇటీవల హింస చెలరేగిన జిర్‌బామ్ జిల్లాలో సీఎం మంగళవారం పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు భద్రతా ఏర్పాట్లలో భాగంగా కాన్వాయ్ వెళ్తుండగా కొట్లెన్ గ్రామానికి సమీపంలో మిలిటెంట్లు దాడికి దిగారు. కాన్వాయ్‌లోని వాహనాలపై పలుమార్లు కాల్పులు జరిపారని, భద్రతా బలగాలు మిలిటెంట్ల కోసం కూంబింగ్ ఆపరేషన్ చేపట్టినట్టు చెప్పారు.

ఏడాది దాటినా మణిపూర్‌లో శాంతి ఏదీ?

ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్

నాగపూర్‌లో ప్రసంగిస్తున్న భాగవత్

నాగపూర్, జూన్ 10: మణిపూర్ హింసపై ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. హింస చెలరేగి ఏడాది దాటుతున్నా.. ఆ రాష్ట్రంలో శాంతియుత పరిస్థితులు నెలకొనటం లేదంటూ పాలకుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం నాగపూర్‌లో ఆరెస్సెస్ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. మణిపూర్ హింసను అత్యంత ప్రాధాన్యత గల అంశంగా పరిగణించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మోహన్ భగవత్ సూచించారు. శాంతి కోసం ఏడాది కాలంగా ఎదురుచూస్తున్నా.. పరిస్థితులు మారటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మాటల చాతుర్యంతో ఎన్నికల్లో గెలుపొందటంపై కాకుండా, దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలని పాలకుల తీరును విమర్శించారు.

సత్నామీల నిరసన హింసాత్మకం

ఎస్పీ ఆఫీసు నుంచి వెలువడుతున్న పొగ

బలోడా బజార్: సత్నామీ తెగవారు అత్యంత పవిత్రంగా పరిగణించే జైత్‌ఖామ్బ్ (స్థూపం)ను గుర్తు తెలియని వ్యక్తులు అపవిత్రం చేయడంతో నిరసనలు పెల్లుబికాయి. ఛత్తీస్‌గఢ్ గిరౌడ్‌పురి ధామ్‌లోని అమర్ గుహలో ఉన్న ఈ పవిత్ర చిహ్నాన్ని గత నెల 15-16 మధ్య రాత్రి అపవిత్రం చేశారు. ఈ కేసులో పోలీసులు ముగ్గుర్ని అరెస్ట్ చేశారు. అయితే ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తూ, కలెక్టర్ కార్యాలయం వద్ద ఘెరావ్ నిర్వహించాలని సత్నామీ తెగవారు పిలుపునిచ్చారు. బలోడా బజార్ పోలీసు సూపరింటెండెంట్ సదానంద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, దాదాపు 5,000 మంది నిరసనకారులు తరలివచ్చి, కలెక్టర్ కార్యాలయంలోకి దూసుకెళ్లారు. రాళ్లు విసురుతూ, కొన్ని వాహనాలను తగులబెట్టారు. ఎస్పీ కార్యాలయానికి నిప్పు పెట్టారు. ఈ కార్యాలయంలో కొంత భాగం దెబ్బతింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి, పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

కెనడాలో భారతీయుడి హత్య

ఒట్టావా : విదేశాల్లో భారతీయులు, భారత సంతతి పౌరులపై దాడులకు అడ్డుకట్ట పడటం లేదు. కెనడాలోని బ్రిటిష్ కొలంబియా ప్రావిన్స్‌లో 28 ఏండ్ల భారత సంతతి పౌరుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటనలో నలుగురు అనుమానితుల్ని పోలీసులు అరెస్ట్‌చేశారు. జూన్ 7న సర్రేలో కాల్పుల ఘటన చోటుచేసుకుందని, గుర్తు తెలియని కొంతమంది యువరాజ్ గోయల్‌పై కాల్పులు జరిపి ఈ హత్యకు పాల్పడ్డారని రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ సోమవారం తెలిపింది.

సాయంత్ర వ్యాయామంతో షుగర్ కంట్రోల్!

న్యూఢిల్లీ : సాయంత్ర వేళల్లో వ్యాయామం చేయడం వల్ల బ్లడ్ షుగర్ లెవెల్స్ నియంత్రణలో ఉంటాయని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఒబేసిటీ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. అధిక బరువు, ఊబకాయంతో బాధపడే పెద్దలు సాయంత్రం పూట మధ్యస్థ స్థాయి నుంచి అధిక స్థాయిలో శారీరక శ్రమ చేయడం వల్ల షుగర్ లెవెల్స్ తగ్గుతాయని అధ్యయనం వెల్లడించింది. స్పెయిన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ గ్రెనడా పరిశోధకులు ఈ అధ్యయనం నిర్వహించారు. 186 మందిపై అధ్యయనం చేయగా, ఉదయం 6 నుంచి మధ్యాహ్నం వరకు, మధ్యాహ్నం నుంచి సాయంత్రం 6 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి అర్ధరాత్రి వరకు 14 రోజులపాటు 46 ఏండ్ల సగటు వయస్సు, అధిక బరువు ఉన్న వారితో వ్యాయామాలు చేయించినట్టు పేర్కొన్నారు. సాయంత్రం వేళల్లో శారీరక శ్రమ చేసిన వారి బ్లడ్ షుగర్ లెవల్స్ తక్కువగా ఉన్నట్టు అధ్యయనంలో తేలింది.

మలావీ ఉపాధ్యక్షుడు ప్రయాణిస్తున్న ప్లైట్ గల్లంతు

బ్